ప్రజాశక్తి

బుధవారం 3 డిసెంబర్ 2025 5 అనంతపురం





దీక్షలో పాల్గొన్న నాయకులు

'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలేదీక్షలు మంగళవారానికి 16వ రోజుకు చేరుకున్నాయి. సిఐటియు తాలుకా అధ్యక్షులు రంగనాథ్, జిల్లా ఆర్గనైజర్ ఆశోక్, తిప్పేస్వామి, మల్లేష్ దీక్షల్లో పాల్గొనగా అంగన్‌వాడీ యునియన్ నాయకురాళ్లు పాతక్క, తులసమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులను బెదిరించడం, వేతనాలు తగ్గిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. వేతనాలు పెంచే విధానం చూశామని తగ్గించే విధానం ఇప్పుడే వింటున్నామని అన్నారు. సంబంధిత తాగునీటి కాంట్రాక్టర్, ఆయన మనుషులు బెదిరిస్తూ కార్మికులతో ఖాళీ బాండ్లపై సంతకాలు చేయించుకోవడం న్యాయం కాదన్నారు. వీటన్నింటిపైనా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నాణ్యతగా బైపాస్ రోడ్డు పనులు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం

ఉరవకొండ పట్టణ పరిధిలోని కనేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉరవకొండ పట్టణ పరిధిలో కనేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులను వేగంగా త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కనేకల్లు క్రాస్ నుంచి గుంతకల్లు రోడ్డు వరకు 3 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు పనులను చేపడుతుండగా, ఇప్పటికే సగానికి పైగా పూర్తి అయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు.ఇప్పటికే కనేకల్లు క్రాస్ నుంచి 900 మీటర్ల మెటల్ రోడ్డు పూర్తి కాగా, మరో 400 మీటర్ల మేర రోడ్డు ముందుకు వెళ్లేందుకు సర్వే చేపట్టాల్సి ఉందని చెప్పారు. సర్వే ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని, రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఏఈ నాగభూషణం, సూపర్‌వైజర్ సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం : ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కార్యాలయంలో వరుసగా రెండవరోజు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉరవకొండ నియోజకవర్గం, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై మంత్రి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజాదర్బార్ లో వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,అధికారులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని రాంనగర్ లో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు క్యాంప్ కార్యాలయంలో సత్య సాయి తాగునీరు సరఫరా పై సత్యసాయి వాటర్ సప్లై బోర్డు డి.ఈ,జె.ఈ ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు.

అరటి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయిన అరటి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజినేయులు, రైతు సంఘం నాయకులు పోతులయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం రాప్తాడు మండలం రామనేపల్లి గ్రామంలోని పెద్దిరెడ్డి అనే రైతు సాగు చేసిన అరటి పంటను పరిశీలించారు.



మాగిపోయిన అరటిపండ్లను చూపుతున్న నాయకులు, రైతులు

అనంతరం వారు మాట్లాడుతూ పి.పెద్దిరెడ్డి అనే రైతు 6 ఎకరాలు అరటి పంట సాగు చేశాడని, మూడు ఎకరాలు కోత దశలో ఉందని అన్నారు. అరటి కొనుగోలు చేయడం కోసం వ్యాపారస్తులు రాకపోవడం వల్ల తోటలోనే అరటి పండ్లు మాగిపోయాయని తెలిపారు. ఎకరాకు రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయాడన్నారు. ఇలా జిల్లాలో అత్యధిక మంది అరటి రైతులు నష్టపోయారని ప్రభుత్వం స్పందించి అరటి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఆసుపత్రులకి ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. కనీసం కేజీ రూ.10తో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు పెద్దిరెడ్డి, మహేంద్ర, రాముడు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలివ్వాలి

డిపిఒకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయిపడిన వేతనాలు ఇప్పించాలని, ఆదాయం ఉన్న మేజర్ పంచాయతీలలో నైనా పిఎఫ్ అమలు చేయించాలని గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సిఐటియు ఆధ్వర్యంలో డిపిఒ నాగరాజు నాయుడును మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం రూరల్, రుద్రంపేట, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల, వజ్రకరూరు, కొనకొండ్ల, మరికొన్ని పంచాయతీలలో నెలలు తరబడి వేతనాలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బకాయిలు ఉన్నాయని తెలిపారు. తక్షణమే బకాయి వేతనాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పిఎఫ్ అమలు చేయడానికి డిపిఒ కార్యాలయం నుంచి పంచాయతీలకు సర్కులర్ పంపించాలన్నారు. స్పందించిన డిపిఒ వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణపురం పంచాయతీలో అమలవుతున్న ప్రకారం పిఎఫ్ సదుపాయం అన్ని పంచాయతీలలో అమలు చేసేలా సర్కులర్ పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు మూర్తి, నాగేంద్ర, పెద్దన్న, వెంకట రాముడు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం నగరంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో గిరిజన శాఖ అధికారులు, ప్రిన్సిపల్స్, హాస్టల్స్ వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందరంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, హాస్టల్లో ఎటువంటి సమస్యలు లేకుండా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. గిరిజన గురుకుల హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని వార్డన్లకు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యులు

సూచించారు. విద్యార్థులు పట్ల వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెరగాలని తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసులు రావు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజనేయులు, ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డెన్లు, రవీంద్ర నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రెండున్నర కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గుంతకల్లు

స్థానిక రైల్వే హాస్పిటల్ వద్ద ఉన్న రైల్వే క్వార్టర్స్ లో ముళ్లపొదల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో దాడులు చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండున్నర కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఒకటవ పట్టణ సిఐ బి మనోహర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక గంగానగర్‌కు యాషర్ అలీ అలియాస్ ఉజిత్ అలీ, షేక్ మొహమ్మద్ అనే షికారిలు మహారాష్ట్రలోని తానే జిల్లా కోస పట్టణం మురమురి రైల్వే స్టేషన్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులతో గంజాయి కొనుగోలు చేసి గుంతకల్లు తీసుకువచ్చారన్నారు. ఆ గంజాయి చిన్న చిన్న పొట్లాలుగా చేసి రైల్వే స్టేషన్ ఏరియాలో అమ్మకాలు చేసి ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం వేశారన్నారు. పక్కా సమాచారంతో దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకుని రెండున్నర కేజీల గంజాయి, 1100 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పరస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కొండయ్య, పోలీసులు పాల్గొన్నారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్, ఇతర అంశాలపై స్థానిక ఎన్‌జిఒ హోంలో పెన్షనర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా ఖజానా కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జి.రమణయ్య సూచనల మేరకు ప్రతి సంవత్సరం పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు, ఇతర అంశాలు, సమస్యల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సులో పెన్షనర్లు పాల్గొని అవగాహన పెంపొందించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గురు ప్రసాద్



కరపత్రాలు విడుదల చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాజ్యాంగాన్ని రక్షించడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని అనంతపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గురుప్రసాద్, ఐలు గౌరవాధ్యక్షులు జి.సీతారాం పేర్కొన్నారు. అనంతపురం బార్ అసోసియేషన్ నందు అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణపై నిర్వహిస్తున్న సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంతపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.గురు ప్రసాద్, ఐలు గౌరవాధ్యక్షులు జి.సీతారాం మాట్లాడుతూ డిసెంబర్ 14న ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో భారత రాజ్యాంగం పరిరక్షణపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా విశ్రాంత న్యాయమూర్తి, మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్.కె.చంద్రు హాజరవుతున్నారని తెలిపారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది, ఐలూ జాతీయ కార్యదర్శి నార్రా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరవుతున్నారని తెలిపారు. అనంతపురం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ.వెంకటరాముడు, ఉపాధ్యక్షులు ధరమ్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రాల అధికారాలు క్రమపద్ధతిలో ఆక్రమించబడుతున్నాయని, వాటిని కేవలం స్థానిక సంస్థలుగా మార్చారని తెలిపారు. రాజ్యాంగం ఉల్లంఘించ బడుతోందని, దాని రక్షించుకోవడం అందరి కర్తవ్యమని అన్నారు. సమస్యలను చర్చించడానికి నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీరమాసప్ప, సతీష్, జిల్లా సహాయ కార్యదర్శి జిసి.ప్రకాష్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో సెలవురోజులు మినహాయించాలి

డిఇఒకు ఎపిటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎస్ఎస్‌సి వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో రెండవ శనివారం, ఆదివారం, సెలవు రోజులు మినహాయింపు ఇవ్వాలని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపిటిఎఫ్



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆధ్వర్యంలో డిఇఒ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ఎస్ఎస్‌సి 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సిసిఎల్ ఇంతవరకు మంజూరు చేయలేదని వాటిని వెంటనే మంజూరు చేయాలని అన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు బిఎడ్, బిపెడ్ కోర్సు జీవో 342 మేరకు అనుమతించాలన్నారు. డిఎస్సీ-2025 ఉపాధ్యాయులు ఎల్ఈఏపి యాప్ ద్వారా సెలవు పెట్టుకోవడంలో ఇబ్బందులు తొలగించేందుకు డిడిఒలకు సూచనలు చేయాలన్నారు. ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష విధులకు హాజరైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి ఆర్జిత సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. నెలవారీ క్లస్టర్ సమావేశాలకు సగం రోజు హాజరు కావడంలో ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ హాజరు నమోదు చేయడానికి లాక్ చేయడం ఉండరాదన్నారు. బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులకు మోయరాని భారంగా తయారయ్యాయని, బోధనా సమయం హరించుకు పోతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, నాయకులు లక్ష్మీనారాయణ, రామలింగ, శివారెడ్డి, నాగరాజు, తిప్పేస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలోని ప్రధాన రహదారి మరమ్మతులు నాసిరకంగా చేయడంతో యథాతథంగా గుంతలు ఏర్పడుతున్నాయి. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు ఉండాలని ముఖ్యమంత్రి చెప్పగా ఈమేరకు రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించగా ప్రధాన రహదారుల్లో పలుచోట్ల గుంతలకు మరమ్మతులు చేశారు. ఇందులో భాగంగా కోతిగుట్ట వద్ద అధిక విస్తీర్ణంలో తారు రోడ్డు, అనంతపురం రహదారి రైల్వే గేటు వద్ద మరమ్మతులు చేపట్టారు. అయితే చేసిన పనులు నాసిరకంగా ఉండటంతో ఆరు నెలలు కూడా గడవకముందే రోడ్డుపై తారు లేకుండా మట్టి, ఇసుక గుంతలు కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి నాణ్యంగా రోడ్డు పనులు చేపట్టాలని వాహన చోదకులు ప్రజలు కోరుతున్నారు.




అనంతపురం రైల్వే గేటు వద్ద రోడ్డు దుస్థితి

పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్. రాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్.రాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు కూడేరు మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రయివేట్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నారన్నారు. దీంతో పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. జిల్లాలో మొక్కజొన్న 42 వేల హెక్టార్లలో సాగు చేశారని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2400 కాగా ప్రయివేటు వ్యాపారులు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

రూ.1800 మించి కొనుగోలు చేయడం లేదన్నారు. పత్తి 29 వేల హెక్టార్లలో సాగు చేశారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8110 కాగా ప్రయివేట్ వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.6500కు మించి కొనడం లేదన్నారు. వరి 32 వేల హెక్టార్లలో సాగు చేయగా ప్రస్తుతం పంట కోతలు ప్రారంభించారని తెలిపారు. అప్పులు చేసి రైతులు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రాకపోవడంతో పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. అరటి సాగుచేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న, వరి, పత్తి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు కడదరకుంట వెంకటేష్, రైతులు శివకుమార్, మల్లికార్జున, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్యాన్ని పరిస్థితులు మెరుగు పరచాల్సిన బాధ్యత శానిటరీ ఇన్స్‌పెక్టర్లపై ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా నగరంలో పారిశుధ్యంపై వస్తున్న ఫిర్యాదులపై ఆరాతీశారు. గత ప్రభుత్వంలో లాగా నిర్లక్ష్యంగా ఉంటే కుదరదని, ఖచ్చితంగా సిబ్బందితోపాటు అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఎక్కడా ఫిర్యాదులు రాకూడదన్నారు. మరోవైపు మెప్మా అధికారులు దృష్టి క్యాంటీన్లు, స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, హెల్త్ ఆఫీసర్ నరసింహులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సిటీ మిషన్ మేనేజర్ కాటమయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పాఠశాలలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని విన్సెంట్‌ఫెర్రర్ జూనియర్ ప్రభుత్వ కళాశాల ముందు బళ్లారి-కణేకల్ రహదారిపై విద్యార్థులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారుమ ఆట్లాడుతూ బడి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలకు అనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో జమేదారు కమల్‌బాషా, సిబ్బందితో చేరుకుని ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సులు నడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సిఐటియు నాయకురాలు నాగమణి, సిఐటియు నాయకులు ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం..

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మండలంలో పలువురికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యం బారిన పడి ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మారుతీనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లికల్లు రంగారెడ్డి, మాసులు చంద్రమోహన్, చిట్టి, రామాంజి, నాగముని, శేఖర్, బాషా, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా విభాగం తనిఖీ

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ కార్యాలయంలోని మెప్మా విభాగాన్ని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విశ్వజ్యోతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో చర్చించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం భవనంలో పీడీ, ఆర్‌పిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ తమ పరిధిలో డేటా ఎంట్రీ వంటి పనులను ఆర్‌పిలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మహిళా సమాఖ్య సంఘాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-ఆత్మకూరు



ఆత్మకూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, అంగన్వాడీలు, ఆశాకార్యకర్తలు

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వతేదీ వరకూ నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. సిఐటియు మండల సమన్వయ కమిటీ మండల కన్వీనర్ మహేష్ అధ్వర్యంలో మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దాడి చేసే విధంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ముఖ్యంగా లేబర్ కోడ్స్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రమాదేవి, మండలంలోని అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాలు విజయలక్ష్మి, ఆశావర్కర్ నాయకురాలు మాంబావతి, పంచాయతీ కార్మికులు శివమ్మ, వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం, సిఐటియు జెండా పోల్ వద్ద సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మండల కన్వీనర్ కె.నాగేంద్ర, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సుబ్రమణ్యం, ఎర్నాగప్ప, ఎర్రగొండప్ప, హమాలీ యూనియన్ నాయకులు రుద్రప్ప, ఆటో, ఆశా, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రాప్తాడు : సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజనేయులు, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, గాయత్రి, నాగేంద్ర, శివలక్ష్మి, వీరమ్మ, లక్ష్మి, సావిత్రి, శ్రావణి, వరలక్ష్మి, ఇందిరమ్మ, అరుణ, మల్లీశ్వరి, లక్ష్మీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

యాడికి : విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వతేదీ వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు ఉమా గౌడ్ పిలుపునిచ్చారు. ఈమేరకు మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మహాలక్ష్మి, బషీర్‌అహ్మద్, మాయకుంట్ల మోహన్, పెద్దన్న, శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వతేదీ వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకురాలు నాగమణి పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఓబులేష్, వన్నూరు స్వామి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష సాధనలో సవాళ్లను అధిగమించాలి

ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి. సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



అతిథిని సన్మానిస్తున్న దృశ్యం

ఫార్మసీ విద్యను అభ్యసించే విద్యార్థులు లక్ష సాధనలో వచ్చే సవాళ్లు అధిగమించి విజయం సాధించాలని ఒటిపిఆర్ఐ డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం జెఎన్‌టియు అనుబంధ ఒటిపిఆర్ఐలో ప్రథమ సంవత్సరం బి ఫార్మసీ, డాక్టర్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎల్.సుబ్రమణ్యం, అనంతపురం వన్‌టౌన్ ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జివి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో పరిణితితో వ్యవహరిస్తూ తమ అభ్యాస, అభ్యాసేతర కార్యక్రమాలపై అకుంఠిత దీక్షను కనబరచాలన్నారు. లక్షాల సాధనకు ఎదురయ్యే అనేక సవాళ్లను స్వీకరించి విజయపథంలో కొనసాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, బోధనేతర, పొరుగు సేవల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిపత్రి తహశీల్దార్‌గా ఐఎఎస్ సచిన్ రహార్



తాడిపత్రి రూరల్ : తాడిపత్రి తహశీల్దార్‌గా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల కిందట ఇక్కడ రెగ్యులర్ తహశీల్దార్‌గా పని చేసిన మునివేలు బదిలీపై వెళ్లడంతో ఉన్నతాధికారులు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా సోమశేఖర్‌ను నియమించారు. ఈనేపథ్యంలో ఐఎఎస్, అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేస్తున్న సచిన్‌రహార్ తహశీల్దార్‌గా నియమించారు.

పంటల బీమా ప్రీమియంపై అవగాహన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాల్లో ఎఒ కాత్యాయిని ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు ఆయా పంటలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియంపై వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కోఆర్డినేటర్ సి.విజయ్‌కుమార్, ఎఐసి మండల కో ఆర్డినేటర్ బాలప్రసాద్, ఎంపిఇఒ నాగలింగేశ్వర, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో పురుష టీచర్లకు క్రికెట్ పోటీలు, మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నారపరెడ్డి, క్లస్టర్ హెడ్‌మాస్టర్ రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రామన్న, కాటమయ్య, శ్రీదేవి, సురేఖ, నసీమా బేగం, తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు పరిశీలన

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండల పరిధిలోని అంకంపల్లి, సాగరం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్లు, పల్లె వనాలను పీడీ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తర్వాత ఇటీవల నాటి మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మురళీకృష్ణ, నాయకులు పురుషోత్తమ నాయుడు, శంకరయ్య, కిష్టయ్య, శ్రీనివాసులు, ఈశ్వర్, మాజీ ఎంపిటిసి ఎర్రే గౌడు, ఫీల్డ్ అసిస్టెంట్ వన్నూరుస్వామి, శ్రీనివాసులు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోకుంటే రోడ్ల దిగ్బంధనం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోకుంటే రోడ్లను దిగ్బంధించాల్సి ఉంటుందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. విత్తనం నుంచి ఎరువులు, పంట విక్రయం వరకు రైతాంగం రోడ్డెక్కే పరిస్థితులు తెచ్చారని విమర్శించారు. ఈ ఖరీఫ్‌లోనూ అదే పరిస్థితి వచ్చిందన్నారు. పంట మార్పిడి చేసుకున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదన్నారు. ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాలు బీడుగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలు దిగుబడులు రావడం లేదని, వచ్చిన పంటను అమ్ముకుందామన్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదన్నారు. కనీస మద్దతు ధర ప్రకటించినా ఒక్క పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. ముఖ్యంగా జిల్లాలో అరటి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గత వైసిపి పాలనలో ప్రత్యేక రైళ్లు వేసి సబ్సిడీలు అందించి అరటి, చీనీ పంటలను ఎగుమతి చేశారని గుర్తు చేశారు. గతంలో అరటి టన్ను రూ.30 వేలు పలికితే నేడు రూ.2వేలకు పడిపోయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. జిల్లా రైతాంగం దయనీయ పరిస్థితుల్లో రోడ్డుమీదకు వస్తుంటే ప్రజాప్రతినిధులు మాత్రం ప్రతిపక్షాలను విమర్శించడానికి మాత్రమే పరిమితం అవుతున్నారని మండి పడ్డారు. ధైర్యముంటే గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్దాం రండి అని సవాల్ విసిరారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, మీ తరపున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలి

ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్

ప్రజాశక్తి-గుంతకల్లు



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉన్నత విద్యాసంస్థల సమయానికి అనుకూలంగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ డిపో ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్లుకు గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించడానికి వస్తున్నారన్నారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, డిప్లొమో కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నారన్నారు. అయితే ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు ఉదయం 7 గంటలకు ఒక బస్సు.. 10:30 గంటలకు మరో బస్సు ఉందన్నారు. అదేవిధంగా గుంతకల్లు నుంచి గుత్తి అనంతపురం వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు పాతకొత్తచెరువు బస్టాఫ్ వద్ద ఆపడం లేదన్నారు. దీంతో విద్యార్థులు కళాశాల సమయానికి రాలేకపోతున్నారన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి నెలలో ఉన్నాయని, డిగ్రీ, డిప్లొమా పరీక్షలో ఈనెల చివరి నుంచి ప్రారంభం అవుతున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో కళాశాల సమయానికి ఆర్టీసీ బస్సులు లేకపోతే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు డిపో మేనేజర్ స్పందిస్తూ సోమవారం వరకు సమయం ఇవ్వాలని.. బస్సులు సర్దుబాటు చేసి విద్యార్థులకు బడిబస్సులు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిషోర్, సమీర్, పవన్, వెంకటేష్, చిన్న విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎడి మురళీకృష్ణ

పశు వైద్య కేంద్రం పరిశీలన

యల్లనూరు : మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రాన్ని ఎడి మురళీకృష్ణ మంగళవారం సందర్శించారు. ఇందులో భాగంగా పశు వైద్య కేంద్రంలోని సిబ్బంది పరిసరాల పరిశుభ్రతతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఎ రేష్మ, సిఒ శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బిటిపి నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి-గుమ్మఘట్ట



ఆయకట్టుదారుల సమావేశంలో మాట్లాడుతున్న మండల టిడిపి కన్వీనర్ కాల సన్నన్న

మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిన నేపథ్యంలో దామాషా ప్రకారం కుడి కాలువ కింద 6వ డిస్ట్రిబ్యూటర్ నుంచి నీరు విడుదల చేయనున్నట్లు ఇఇ సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బిటి ప్రాజెక్ట్ విశ్రాంతి భవనంలో కుడి, ఎడమ కాలువల అధ్యక్షులు కాలవ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ కర్ణాటకలో అధిక వర్షాలు కురవడంతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండిందన్నారు. దీంతో దామాషా ప్రకారం ఆఖరి డిస్ట్రిబ్యూటర్ వరకూ నీటిని విడుదల చేయడానికి ఆమోదం తెలిపినట్లు వివరించారు. రైతులు నీటిని దుర్వినియోగం చేసుకోకుండా సక్రమైన పద్ధతిలో వాడుకోవాలని సూచించారు. అంతకుముందు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కాలవ సన్నన్న, బిటిపి కాలువ ఉపాధ్యక్షులు సుభాన్, డిఇ గీతాలక్ష్మి, ఎఇ హరీష్, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల తహశీల్దార్లు రజాక్‌వలి, సుమతి, ఎంపిడిఒ జయరాములు, కళ్యాణదుర్గం డిఇ దామోదర్, ఎంపిపి భవాని, బ్రహ్మసముద్రం మండల టిడిపి కన్వీనర్ శ్రీరాములు, తాలూకా జనసేన అధ్యక్షులు మంజునాథ, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ దానవేంద్ర, మాజీ ఎంపిపి గిరిమల్లప్ప, సర్పంచు విజయలక్ష్మి, వీరాపురం సర్పంచు నాగరాజు, బేలోడు సంజీవ, సదాశివ, వైదొడ్డిరాజు, చిన్నికిష్టప్ప, కుమార్‌రెడ్డి, కలుగోడు గుడిసి గోవిందు, వెంకటంపల్లి తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చొరవ చూపాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రాయదుర్గంలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి సమైక్యాంధ్ర భవనంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ నినాదాలు కేవలం నినాదాలుగా మాత్రమే మిగిలిపోతున్నాయన్నారు. రాయదుర్గంలో పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తూ పట్టణాన్ని స్వచ్ఛ రాయదుర్గంగా మార్చడానికి అవసరమైన పారిశుధ్య కార్మికులు లేకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన మున్సిపల్ కార్మికుల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. మరోవైపు రాయదుర్గం పురపాలక సంఘాన్ని గ్రేడ్-1 పురపాలక సంఘంగా మార్చడాన్ని సిపిఎం స్వాగతిస్తోందని.. అయితే గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో సరిపడా కార్మికుల సంఖ్య పెంచకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి పట్టణాన్ని పారిశుధ్య రహిత పట్టణంగా మార్చడానికి అవసరమైన కార్మికుల సంఖ్య పెంచి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, ఓబులేష్, తిప్పేస్వామి, ఆంజనేయులు, నగేష్‌నాయక్, రమేష్, ఆంజనేయులు, నాగ, రుద్ర, తదితరులు పాల్గొన్నారు.

నార్పల డిప్యూటీ ఎంపిడిఒగా సుజాత



నార్పల : నార్పల మండల ఉప మండల అభివృద్ధి అధికారిణిగా ఎస్.సుజాత నియమితులయ్యారు. అనంతపురం పిఆర్ఐ డివిజన్‌లో సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న సుజాత ఉద్యోగోన్నతిపై నార్పల ఉప మండల అభివృద్ధి అధికారిగా నియమితులయ్యారు. ఈమేరకు త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు మండల అభివృద్ధి అధికారిణి మమతాదేవి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శేషారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'పది' మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంతకల్లు

యుటిఎఫ్ ప్రచురించిన పదో తరగతి మోడల్ పేపర్లను మంగళవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు మాట్లాడుతూ యుటిఎఫ్ 10 వరతగతి విద్యార్థుల కోసం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తయారు చేసిన మోడల్ పేపర్స్‌ను ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా నాయకులు జి.రామాంజనేయులు, గౌరవాధ్యక్షులు శంకరయ్య, జిల్లా నాయకులు రాజ్‌కుమార్, అర్బన్, రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లన్న, రమేష్, గిరిబాబు, రూరల్ మాజీ అధ్యక్షులు చౌడప్ప, జిల్లా కౌన్సిలర్లు ఆర్.రవిప్రసాద్, మారుతీప్రసాద్, యుటిఎఫ్ మహిళా విభాగ కన్వీనర్ కల్పన, ఉపాధ్యక్షురాలు విశాలాక్షి, మహిళా ఉపాధ్యాయినిలు మల్లీశ్వరి, భాగ్యవతి, కస్తూరి రూరల్ నాయకులు శంకర్‌నాయక్, చంద్రశేఖర్, శ్యామ్‌నాయక్, సుధాకర్, పెన్నయ్య, పెద్దయ్య, చిరంజీవి, మురళీకృష్ణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మండలంలోని అవులదట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు మంగళవారం పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి, ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా కార్యదర్శి వి.సుబ్బరాయుడు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర, మురళీ, గుమ్మఘట్ట అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు నాగరాజు, రామాంజినేయులు, సభ్యులు ప్రవీణ్, రాజేష్, శివశరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అరటి రైతులను ఆదుకుంటాం

జిల్లా ఉద్యానవన అధికారిణి డి.ఉమాదేవి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



బుక్కరాయసముద్రం మండలంలో అరటి తోటను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలోని అరటి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా ఉద్యానవన అధికారిణి డి.ఉమాదేవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతు జె.సంజీవ్ సాగు చేసిన అరటి పంటను ఉద్యాన సహాయ సంచాలకులు దేవానంద్, ఉద్యాన శాఖ అధికారిణి ఎం.శైలజతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా రైతుకు ఎంత పంట పెట్టుబడి అయింది.. ఎన్ని కోతలు, ఎంత రేటుకు అమ్ముకున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. అలాగే ఈనెలలో జరుగుతున్న పంటకోతలను సకాలంలో తగిన ధరలతోనే మార్కెటింగ్ చేసుకోవాలని కోరారు. పంట కోయకుండా అలాగే ఉంచితే మార్కెట్‌కి అనుకూలం కాకుండా రాబోయే పంట కోతకు చీడపీడలు ఎక్కువగా సోకే అవకాశం ఉంటుందన్నారు. అలాగే గ్రామంలో అరటి పంట అధిక దిగుబడి ఉండటంతో ఎగుమతి కంపెనీ (బంధన్) వాళ్లకు అనుసంధానం చేశారు.

పుట్లూరు : మండల పరిధిలోని సూరేపల్లి, కడవకల్లు గ్రామాల్లో రైతులు సాగు చేసిన అరటి తోటలను జిల్లా ఉద్యానవన అధికారిణి ఉమాదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరటి పంటను కొనుగోలు చేసేందుకు వివిధ కంపెనీ ప్రతినిధులు పొలాల వద్దకే వస్తున్నారన్నారు. రైతులు ఎవరూ నిరుత్సాహం పడాల్సిన అవసరం లేదన్నారు. గతవారం నుంచి రోజురోజుకీ ధర పెరుగుతోందన్నారు. రైతులు ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకులు దేవానంద్, ఉద్యాన అధికార నెట్టికంటయ్య, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, గ్రామ ఉద్యాన సహాయకురాలు రస్మిత, రైతులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని అంకంపల్లి, దుద్దేకుంట గ్రామాల్లో రైతులు సాగుచేసిన అరటి పంటలను ఉద్యానవన అధికారి ఎం.కృష్ణతేజ మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా అరటి కోతల వివరాలను రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి తోటలు పంట తెగుళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎన్‌జిఒ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-గుంతకల్లు



నూతన కమిటీ సభ్యులను సన్మానించిన దృశ్యం

ఎపి ఎన్‌జిఒ నూతన కమిటీని మంగళవారం కసాపురం రోడ్డులోని ఎన్‌జిఒ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్ ఆధ్వర్యంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అసోసియేషన్ అధ్యక్షులుగా సంపూర్ణ ఎస్తేర్, కార్యదర్శిగా చాంద్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, తలారి కృష్ణ, (వీఆర్వో) సభ్యులుగా మున్సిపల్ ఆర్ఐ ఎర్రిస్వామి, సీకే రామాంజనేయులు, పత్రాల సురేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సభ్యులను కలుపుకుని రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, ఉమెన్స్‌వింగ్ జిల్లా ఛైర్మన్ జమీలా, తదితరులు పాల్గొన్నారు.

'పెంచలయ్య' హంతకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-గుత్తి



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

నెల్లూరులో సిపిఎం, ప్రజా నాట్యమండలి నాయకుడు పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన గంజాయి ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని గాంధీ కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో సిపిఎం నాయకుడు పెంచలయ్యని గంజాయి ముఠాకు సంబంధించిన కామాక్షమ్మ, తదితరులు హత్య చేయడం బాధాకరమన్నారు. వెంటనే శిక్షించాలని సిపిఎం నెల్లూరు జిల్లాలో బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. బంద్‌కు మద్దతుగా గుత్తిలో నిరసన తెలిపినట్లు వివరించారు. పెంచలయ్య మృతికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్, మహిళ నాయకురాళ్ళు నాగరత్నమ్మ, మల్లికా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సాయి ఫర్టిలైజర్స్, రాయల్ ట్రేడర్స్, జయ మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన ద్రవ్య, పుడి ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.8.66 లక్షలు విలువజేసే సంబంధిత ఎరువులను సీజ్ చేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు తీసుకునేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ ఆఫీసర్ రవి, ఎడిఎ యల్లప్ప, ఎఒ శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE ANANTHAPURAMU
I.A.No:11/2025 in I.P No: 1/2023

Between:
Tagarakunta Venkata Rami Reddy and another ...**Petitioners/Plaintiffs**
AND
S.Fakruddin and another ...**Respondants/ Defendants**

NOTICE TO THE RESPONDANT NO:1
R1: S.Fakruddin, S/o S.Khasim Sab, R/o Garladinne Village & Mandal, Anantapuramu District,
పై నెంబరు కేసులో Respondant అయిన మీ హాజరు నిమిత్తము 29-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By order of the court)
N.R.K.MOHAN,
Advocate, Ananthapuramu
Cell No: 9440787100

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.A.No.90/2025 in E.P.Nil/2025 in O.S.No.17/2018

Between:
Talari Thippeswamy died by his LRs,Talari Mallamma and others ...**Petitioners/D.Hrs**
AND
H.Mallikarjuna ...**Respondent/J.Dr**

NOTICE TO THE J.Dr
To,
H.Mallikarjuna, S/o Virupakshappa, Business,R/of T. Veerapuram village, Rayadurg Mandal, Anantapuramu Dist. now R/of Lakshmisatyanarayana Bhavanam, 3rd floor, 9th ward, Rajeevgandhi colony, Rayadurg town., Anantapuramu Dist.,
పై నెంబరు కేసులో J.Dr అయిన మీ హాజరునిమిత్తము 15-12-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
G.ERAMASAPPA, Advocate, Ananthapur
G.LOKANADA, Advocate , Rayadurgam
Cell; 9966766645

IN THE COURT OF THE 1 St ADDL. JUNIOR CIVIL JUDGE; ANANTHAPURAMU
E.P.No: 112/2024 in O.S. No: 295/2022

Between:
C.Pedda Venkata Reddy ...**Decree Holder**
AND
C.Anuradha, W/o Virupakshaiah, D.No: 6-683, Andhra Bank Colony, Ananthapuramu ...**Judgement Debtor**

కోర్టు ప్రకటన
పై నెంబరు Execution Petition ను డిక్రీహోల్డర్ (J.Dr) అయిన నీ పైన దాఖలు చేసియున్నాడు. సదరు కేసు నీ హాజరు నిమిత్తం 18-12-2025వ తేదీన వాయిదా వున్నది. కావున ఆరోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
K.GIRISH,
Advocate for Decree Holder,
Ananthapuramu,
Cell No: 9866104211